సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 30 । ఆగస్టు । 2025



తపాలా సేవలపై అయోమయం

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ఈ-సేవల విస్తరణ కోసం సరికొత్త ప్రయోగాలుచేస్తున్న పోస్టల్‌శాఖ పాతసేవలను ఒకొక్కటిగా రద్దుచేస్తూ వస్తోంది. -8లో



నాందేడ్-ధర్మవరం రైలు రద్దు

తెలంగాణాలో భారీ వర్షాల కారణంగా 07189, 07190 నాందేడ్-ధర్మవరం, ధర్మవరం-నాందేడ్ మీదుగా నడుస్తున్న రైలును ఈనెల 29, 30 తేదీల్లో రద్దు చేశారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.6/25.1

జిల్లాలో శుక్రవారం 25.1 - 33.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

లంబో'ధర' లడ్డూ



లడ్డు ప్రసాదంతో కల్లూరి రామిరెడ్డి

మైదుకూరు: లంబోదరుడి లడ్డూ ప్రసాదానికి యమ డిమాండ్ ఉంది. రూ.లక్షల్లో ధర పలుకుతోంది. వినాయక చవితి ఉత్సవాల్లో మూడో రోజైన శుక్రవారం భారీగా వేలం పాటలు నిర్వహించారు. పలువురు భక్తులు పోటీ పడి దక్కించుకున్నారు. అలాగే పూజ సామగ్రిని పొందేందుకు అమితాసక్తి కనబరిచారు. స్వామి వారి ప్రసాదం, పూజ సామగ్రి అందడం తమ అదృష్టంగా భావిస్తున్నామని వారు తెలిపారు. మండపం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తులకు పంపిణీ చేశారు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలో ఈ పరిస్థితి కనిపించడం విశేషం.

- మైదుకూరు మండలంలోని అన్నలూరు అరవింద్‌నగర్‌లో అదే గ్రామానికి చెందిన కల్లూరి రామిరెడ్డి 10 కిలోల లడ్డూను రూ.4 లక్షలకు సొంతం చేసుకున్నారు. తోట వెంకటరామిరెడ్డి 15 గ్రాముల వెండి కాయిన్‌ను రూ.1.20 లక్షలకు పొందారు. మండలంలోని తిప్పిరెడ్డిపల్లెలో కొండిశెట్టి బాలుడు రూ.14 వేలకు చెరకు గడలను కైవసం చేసుకున్నారు. మైదుకూరులోని శీలం నగర్‌లో లడ్డూ ప్రసాదాన్ని మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, ఆయన కుమారుడు మాచనూరు సాగర్ రూ.2.16 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు.
- వీరపునాయునిపల్లెలోని నడివీధి గంగమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డూను నల్రెడ్డి అరుణ్‌కుమార్‌రెడ్డి 2.35 లక్షలకు దక్కించుకున్నారు.
- బద్వేలు పట్టణం తెలుగుగంగ రోడ్డులోని నారాయణ స్కూల్ దగ్గర వినాయక విగ్రహం లడ్డూను రూ.1.89 లక్షలకు మణ్యం శంకర్‌రెడ్డి వశం చేసుకున్నారు.

శోభాయమానం.. నిమజ్జనోత్సవం

అశేష భక్తజనం జేజేలు పలకగా.. భక్తి పారవశ్యంతో బైబైలు చెప్పగా.. కన్నుల పండువగా శోభాయాత్ర సాగగా.. దారి పొడవునా 'గణపతి బప్పా మోరియా' నినాదాలు మారుమోగగా.. ఊరు వాడా జన సాగరమై కదిలిరాగా.. నదుల తీరం.. భక్తజన హారంలా మారిన వేళ.. గణనాథులు గంగమ్మ ఒడికి చేరుకున్నారు. నిమజ్జనోత్సవం వెల్లివిరిసింది. యువత ఉత్సాహం వెల్లువెత్తింది. ఆబాల గోపాలం ఆనందంతో తన్మయత్వమైంది.

- గణనాథుడికి ఘనంగా వీడ్కోలు
- కమనీయంగా శోభాయాత్ర
- వెల్లువెత్తిన నిమజ్జనోత్సాహం
- భక్తజన సంద్రంగా నదుల తీరం
- మార్మోగిన జై గణేశా నినాదాలు



కడపలో గణేశుడి ఊరేగింపు



తొండూరులో ఉరకలెత్తిన ఉత్సాహంలో యువత



కడప సెవెన్‌రోడ్స్: బొజ్జ గణపతిని మూడు రోజుల పాటు పూజించిన అనంతరం శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. జిల్లాలో ఎప్పటి కంటే ఈ ఏడాది 10 శాతం ఎక్కువ విగ్రహాలను పందిళ్లలో ఏర్పాటు చేశారు. పోలీసు శాఖ ప్రత్యేకంగా రూపొందించిన గణేష్ ఉత్సవ్.నెట్ వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో 4500 విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రాలు జారీ చేసింది. శుక్రవారం జిల్లాలో సుమారు 1600 విగ్రహాలు నిమజ్జనానికి తరలి వెళ్లాయి. జైబోలో గణేష్ మహరాజ్‌కీ.. గణపతి బొప్పమోరియా నినాదాలు.. తప్పెట్లు, చెక్కభజనలు, బ్యాండుమేళాలు, భక్తి గీతాలాపనలు, యువకుల ఈలలు, కేరింతలు, ఉత్సాహాల మధ్య శోభాయాత్ర ఉత్సాహంగా జరిగింది. పలు చోట్ల గణపతి చేతిలో పూజలందుకున్న లడ్డూల వేలం పాటలు, ఉట్టికొట్టడం, మహిళలకు ముగ్గుల పోటీలు, బాలలకు వివిధ రకాల పోటీలను ఏర్పాటు చేసి బహుమతులు ఇవ్వడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దాతల సహకారంతో వినాయక మండపాల నిర్వాహకులు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ట్రాక్టర్లు, లారీలు, మినీ క్యారేజ్ లారీలు, ఎడ్లబండ్లలో గణనాథులను ఊరేగింపు నిర్వహించారు. యువకులు, బాలలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ మేళతాళాలు డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేసుకుంటూ విగ్రహం వెంట నిమజ్జనానికి వెళ్లారు. ఉత్సవాల్లో ఐదవ రోజైన ఆదివారం మరో 1550 విగ్రహాల నిమజ్జనం జరగనున్నట్లు పోలీసువర్గాల ద్వారా తెలుస్తోంది. వినాయక నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు పోలీసు శాఖ అనేక చర్యలు చేపట్టింది. అసాంఘిక శక్తులు, అల్లరిమూకలపై నిఘా ఉంచారు.



సందడే సందడి

కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం, బద్వేలుతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భారీ విగ్రహాలను ఆయా ప్రాంతాల సమీపంలోని నీటి వనరులతోపాటు కుందూ, పెన్నా తదితర నదుల్లో నిమజ్జనం చేశారు. మిగతా విగ్రహాలు 7, 9 రోజులలో నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మొత్తం మీద ఈ ఏడాది వినాయక చవితి సందడి ఎక్కువగా సాగింది. పందిళ్లు కూడా అధికంగా ఏర్పాటు చేశారు. నీరు సమృద్ధిగా ఉండటంతో యువత ఉత్సాహంగా నిమజ్జనానికి తరలి వెళ్లారు.





దేవునికడప చెరువులో గంగమ్మ ఒడికి చేరుతున్న గణనాథులు



వీరపునాయునిపల్లెలో భారీ సంఖ్యలో గౌరీ పుత్రుడి విగ్రహాల గ్రామోత్సవం



కడపలో యువత కేరింతలు



ఊరేగింపులో భక్తుల కోలాటం



దువ్వూరులో కేసీ కెనాల్ వద్ద నిమజ్జనానికి తరలివచ్చిన గణపయ్యలు

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి డీటీసీగా వీర్రాజు



కడప వైఎస్ఆర్ సర్కిల్: వైఎస్ఆర్ జిల్లా ఉపరవాణా శాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా వీర్రాజును నియమిస్తూ రాష్ట్ర రవాణా శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన సోమ లేదా మంగళవారాల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. ఈయనకు గతంలో ప్రొద్దుటూరు ఆర్టీవోగా పని చేసిన అనుభవం ఉంది.

నేడు బార్లకు లక్కీ డ్రా

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని 27 బార్లు, గీత కులాలకు కేటాయించిన -2 బార్లకు శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ హాల్‌లో లక్కీ డ్రా నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవి కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బార్లకు దరఖాస్తు చేసుకున్న వారు ఉదయం 7.30 గంటలకు తమ ఎంట్రీ పాసులతోపాటు ఐడీ కార్డు తీసుకొని హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. ఒక వేళ ఎవరైనా హాజరు కాలేకపోతే వారి తరపున వచ్చే వ్యక్తి తగిన అధికారిక ఆథరైజేషన్ ధ్రువపత్రాలతోపాటు ఫొటో గుర్తింపు కార్డు తీసుకుని రావాలని వివరించారు.

ఏఆర్ డీఎస్పీకి అదనపు ఎస్పీగా పదోన్నతి

కడప అర్బన్: వైఎస్ఆర్ కడప జిల్లా ఏఆర్ పోలీస్ విభాగంలో డీఎస్పీగా పని చేస్తున్న శ్రీనివాసరావుకు అదనపు ఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 1991 బ్యాచ్‌కు చెందిన ఈయన ఏఆర్ విభాగంలో పలు జిల్లాల్లో విధులు నిర్వహించారు. 2001లో ఆర్ఐగా పదోన్నతి పొంది నెల్లూరు, విజయవాడ, హైదరాబాద్, వైజాగ్, తిరుపతిలలో పని చేశారు. 2011లో ఏఆర్ డీఎస్పీగా పదోన్నతి పొంది ఏపీ జెన్‌కో విజిలెన్స్‌లో ఉంటూ కడపకు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఏఆర్ డీఎస్పీగా కడపలో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈయనకు పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఏఆర్ అదనపు ఎస్పీగా పదోన్నతి కల్పించి ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు.

వైభవంగా ఆరోగ్యమాత ఉత్సవాల ప్రారంభం



పతాకం ఎగురవేసి ఉత్సవాలు ప్రారంభిస్తున్న బిషప్ సగినాల పాల్ ప్రకాశ్

కడప సెవెన్‌రోడ్స్: కడప నగరం రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో తిరునాల మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బిషప్ సగినాల పాల్ ప్రకాశ్ పతాకాన్ని ఎగురవేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం శాంతి కోసం పావురాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా బిషప్ దివ్యబలిపూజ సమర్పించి మాట్లాడారు. తిరునాల ఉత్సవాలు ఘనంగా, సవ్యంగా సాగాలని కోరారు. ప్రజలంతా శాంతి సమాధానాలతో ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. దేవుడు ప్రజలు ప్రార్థనలు ఆలకించి వారి అభీష్టాలను నెరవేర్చాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ ఎండీ ప్రసాద్‌రావుతోపాటు ఫాదర్ ఎ.జోసెఫ్‌రాజు, డీన్ రెవరెండ్ ఫాదర్ ఎస్.సురేష్, విచారణ ప్రెసిడెంట్ విక్టర్, కార్యదర్శి సెబాస్టియన్, ఆర్థిక కార్యదర్శి జి.ఆనందరావు, డయాసిస్ గురువులు, ఆరోగ్యమాత, జేయంజె, క్రీస్తు జ్యోతి సిస్టర్స్, తిరునాల కమిటీ పెద్దలు, పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలపై ప్రజల్లో ఆగ్రహం

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలప్పుడు అమలు సాధ్యం కాని అనేక హామీలను చంద్రబాబు నాయుడు ఇచ్చారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అంటూ కూటమితోపాటు ఎల్లో మీడియా విపరీతంగా ప్రచారం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే హామీల అమలు అంటూ రాష్ట్రంలోని ప్రతి ఇంటికి బాండ్లు పంపిణీ చేశారన్నారు.

ఏడాది దాటిపోయినా ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. ప్రతి మహిళకు ఏడాదికి రూ.18 వేలు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఊసే లేదన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లలో ఒక్క సిలిండర్ కూడా సరిగా ఇవ్వడం లేదన్నారు. ఉచిత బస్సు పథకాన్ని కొన్ని బస్సులకు మాత్రమే పరిమితం చేశారన్నారు. అమరావతి అభివృద్ధి అంటూ ప్రజలను మభ్యపెట్టడం జరుగుతోందన్నారు. చంద్రబాబు నాయుడు చేస్తున్న మోసాలు, ఆరాచకాలను రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని, ప్రజలు ఆయనకు సరైన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. అనంతరం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేశారు.

నేటి నుంచి అండర్-23 మ్యాచ్‌లు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రీడా మైదానాల్లో శనివారం నుంచి సెప్టెంబర్ 17 వరకు ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మల్టీడే మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డి ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జట్ల మధ్య మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

రేషన్‌షాపుల ద్వారా జొన్నల పంపిణీ

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వ చౌక దుకాణాల ద్వారా సెప్టెంబరు నుంచి బియ్యంతోపాటు జొన్నలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు జేసీ అదితిసింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక బియ్యం కార్డులో ముగ్గురు సభ్యుల కన్నా తక్కువ ఉంటే వారికి కిలో జొన్నలు ఇస్తామన్నారు. 3 లేదా అంతకన్నా ఎక్కువ మంది ఉన్న కార్డుదారులకు, అలాగే అంత్యోదయ అన్నయోజన కార్డుదారులకు రెండు కిలోల జొన్నలు బియ్యానికి బదులుగా ఇస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు పొడిగింపు

కడప సెవెన్‌రోడ్స్: జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు మరో మూడు నెలలపాటు పొడిగిస్తూ సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు అక్రిడిటేషన్ కార్డులు కలిగి ఉన్న పాత్రికేయులకు నవంబరు 30వ తేదీ వరకు పొడిగించారన్నారు. ఈలోపు కొత్త అక్రిడిటేషన్ల జారీ చేస్తే అప్పటి వరకే ఇవి చెల్లుబాటులో ఉంటాయన్నారు. ఏది ముందు జరిగితే అప్పటి వరకు పొడిగింపు ఉత్తర్వులు అమలులో ఉంటాయన్నారు. జిల్లాలో అక్రిడిటేషన్ సౌకర్యం ఉన్న సంబంధిత యాజమాన్యాల వారు.. సంస్థలో పని చేస్తున్న వారి జాబితాలను జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో ఈనెల 30వ తేదీలోపు అందజేసి స్టిక్కర్లను పొందాలని వివరించారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహకాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అదే దిశగా జిల్లాలో కూడా పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం చాంద్ బాషా, ఏపీఐఐసీ జెడ్ ఎం శ్రీనివాసమూర్తి, లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్ధన, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ చిన్నా రావు, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, డీడీఆర్ఎఫ్ అధికారులు, డీటీఓ అధికారులు, వాణిజ్య పన్నుల శాఖ, ఏపీఎస్ పీడీసీఎల్ శాఖల అధికారులు, ఏపీఐఐసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రుణాల మంజూరు బ్యాంకర్లు చొరవ చూపండి

వ్యవసాయ అనుబంధ రంగాలకు విరివిగా రుణాల మంజూరుకు బ్యాంకర్లు చొరవ చూపాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డీసీసీ/డీఎల్ఆర్‌సీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సంబంధిత అధికారులతో ఎల్‌డీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సకాలంలో క్రాప్ లోన్లు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం జనార్ధనం, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు డాక్టర్ రాజ్యలక్ష్మీ, కిరణ్ కుమార్, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు చంద్రానాయక్, రవి చంద్రబాబు, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ లక్ష్మీతులసి, నాబార్డ్ డీడీఎం విజయ విహారి, ఆర్ఎం ఎస్‌బీఐ కృష్ణ కిషోర్, వివిధ బ్యాంకు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా చర్యలు పటిష్టం చేయాలి

పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా క్రైసిస్ గ్రూప్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల లోపలే కాకుండా పరిశ్రమల చుట్టుపక్కల ఉన్న ప్రజల ఆరోగ్యాన్ని దష్టిలో ఉంచుకుని మరింత భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ చిన్నారావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఏపీఎస్ పీడీసీఎల్, ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, ఫైర్ శాఖ, సిమెంట్ పరిశ్రమల ప్రతినిధులు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన

కడప ఎడ్యుకేషన్: డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం ముగిసింది. కడప బాలాజీనగర్‌లోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో డీఈఓ షేక్ షంషుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం రెండవ రోజు ప్రశాంతంగా ముగిసింది. ఇందులో భాగంగా స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్స్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్‌తోపాటు పలు రకాల ఉపాధ్యాయ పోస్టులకు మొదటిరోజు 712 మంది అభ్యర్థులకు గాను 609 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండవ రోజు మిగిలిన 103 మంది తోపాటు స్టేట్, జోన్‌కు సంబంధించి 535 మంది అభ్యర్థులు వచ్చారు.



అభ్యర్థుల పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

క్లుప్తంగా

కూలిన మట్టి మిద్దె
– తప్పిన పెనూ ప్రమాదం


కూలిన ఇంటిని చూపుతున్న బాధితరాలు

ఎర్రగుంట్ల : మండల కేంద్రమైన యర్రగుంట్ల పురపాలక సంఘం పరిధిలోని వినాయకనగర్ కాలనీలో నివాసం ఉండే మరియమ్మ ఇల్లు ఇటీవల కూరిసిన వర్షాలకు తడిసి దూళాలు విరిగి పోయి శుక్రవారం తెల్లవారిజామున కూలి పోయింది. ఆ సమయంలో మరియమ్మ ఇంటిలో లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ సందర్భంగా బాధితరాలు మరియమ్మ మాట్లాడుతు వినాయకనగర్ కాలనీలో మట్టి మిద్దెలో నివాసం ఉంటున్నట్లు తెలిపింది. అయితే ఇటీవల కురిసిన వర్షాల వల్ల మిద్దె అంత తడిసి వర్షం నీటితో ఊరుస్తుండేదన్నారు. గురువారం పని మీద బయటకు వెళ్లినట్లు తెలిపారు. శుక్రవారం వచ్చి చూడగానే మిద్దె అంతా కూలిపోయి ఉందన్నారు. ఇంటిలో సామగ్రి అంతా మట్టిపాలైందని వాపోయింది. ప్రభుత్వం ఆదుకొని ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం సాయం అందించాలని బాధితరాలు వేడుకుంది.

చైన్ స్నాచింగ్

కలసపాడు : మండలంలోని పోరుమామిళ్ల – కలసపాడు ప్రధాన రహదారి సిద్ధమూర్తిపల్లె వద్ద శుక్రవారం సాయంత్రం మహిళ మెడలో నుంచి బంగారు సరుడురె దుండగుడు లాక్కెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. సిద్ధమూర్తిపల్లెకు చెందిన పాలకొలను మల్లేశ్వరి గడ్డి మోపును ఎత్తుకుని వస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి పల్సర్ బైక్‌పై వచ్చి ఆమె మెడలోని మూడు తులాల బంగారు సరుడు లాక్కెళ్లాడు. వెంటనే బాధితురాలు కలసపాడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని పోరుమామిళ్ల సీఐ డి.శ్రీనివాసులు, కలసపాడు ఎస్‌ఐ తిమోతి పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిమోతి తెలిపారు.

రిజిస్ట్రేషన్లు రెన్యూవల్ చేసుకోవాలి


మాట్లాడుతున్న ఆదాయపుపన్నుశాఖ అధికారి శివశంకర్

కడప కోటిరెడ్డిసర్కిల్ : స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థల రిజిస్ట్రేషన్లను సెప్టెంబరు 30వ తేదీలోపు రెన్యూవల్ చేసుకోవాలని తిరుపతి ఆదాయపు పన్నుశాఖ అధికారి శివశంకర్ సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీసీఈ భవనంలో తిరుపతి ఆదాయపు పన్ను అధికారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదాయపు పన్ను సంచాలకులు బాలకృష్ణ, అదనపు సంచాలకులు సుమిత ఆదేశాల మేరకు పన్ను చట్టంలోని మినహాయింపుల నూతన సవరణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి సందేహాల నివృత్తికి 89859 71460 నెంబరులో సంప్రదించాలన్నారు. కడప ఆదాయపు పన్నుశాఖ అధికారి సత్యనారాయణ, చార్టెడ్ అకౌంటెంట్లు, ట్యాక్స్ కన్సెల్టెంట్లు, స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

తపాలా సేవలపై అయోమయం..!

- ఇప్పటికే రిజిస్టర్డ్ పోస్టల్ సేవల నిలిపివేత నిర్ణయం
- తాజాగా లెటర్‌రెడ్(పోస్ట్)బాక్స్ ఎత్తివేత ప్రచారం
- అవి ఊహాగానాలే అంటున్న తపాలా వర్గాలు
- ఈ–సేవ విస్తరణలో పోస్టల్‌శాఖ నిమగ్నం



రాజంపేట : ఆధునిక సాంకేతిక సమాచార వ్యవస్థను అందిపుచ్చుకుంటూ ఈ–సేవల విస్తరణ కోసం సరికొత్త ప్రయోగాలుచేస్తున్న పోస్టల్‌శాఖ పాతసేవలను మాత్రం ఒకొక్కటిగా రద్దుచేస్తూ వస్తోంది. ఇప్పటికే పలు సేవలు రద్దుకాగా, సెప్టెంబరు 1 నుంచి రిజిస్టర్ పోస్ట్‌సేవలు నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. మరోవైపు లెటర్ రెడ్ (పోస్టట్)బాక్స్‌లను కూడా ఎత్తివేయనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ప్రధానంగా పోస్టల్ శాఖ నూతన ఒరవడితో ఈ–సేవల విస్తరణపై దృష్టి సారించినట్లుగా కనిపిస్తోంది. మొబైల్‌ఫోన్లు, ఇంటర్నెట్ సేవలు లేని రోజుల్లో సమాచార వ్యవస్థకు ఉన్న ఏకైక దిక్కు తపాలానే...అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలకు మరింత సులువైన సేవలందించేందుకు సాంకేతిక టెక్నాలజీకి పోస్టల్ డిపార్టుమెంట్ అప్‌గ్రేడ్ అవుతోంది.

రిజిస్టర్డ్ పోస్టుకు మంగళం

పోస్టల్‌శాఖ రిజిస్టర్ పోస్టు సేవలకు మంగళం పాడనున్నది. తాజాగా బ్రిటిషు కాలం నుంచి వస్తున్న రిజిస్టర్ పోస్ట్‌సేవలు సెపెంబరు1 నుంచి నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే పోస్టుమాస్టర్లకు శాఖపరమైన నోటీసులు జారీచేసింది. ఒకప్పుడు బంధుమిత్రులకు కబురు పంపాలన్న..ముఖ్యమైన పత్రాలు చేరవేయలన్నా పోస్ట్‌కార్డు లేదా రిజిస్టర్డ్ మాత్రమే అందుబాటులో ఉండేది.

సుమారు 17యేళ్లుగా..

పోస్టల్ వ్యవస్థ ప్రజల జీవితంలో విడదీయరాని భాగమైంది. కాలంతో పాటు మారిన పోస్టల్ డిపార్టుమెంట్ ఇప్పుడు మరింత ఆధునికసేవలతో ముందుకు వస్తోంది. 1854లో అప్పటి బ్రిటిషర్ లార్డ్‌డల్హౌసీ ప్రవేశపెట్టిన ఇండియా పోస్ట్ ఆఫీస్ చట్టంతో సేవలు ప్రారంభమైయ్యాయి. అంతకముందుగా 1766లో వారెన్ హేస్టింగ్స్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో కంపెనీ మెయిల్ మొదలైంది. దాదాపు 171యేళ్లుగా ముఖ్యమైన పత్రాలను, వస్తువులను సురక్షితంగా, నమ్మకంగా పంపించడానికి రిజిస్టర్డ్ పోస్ట్ ప్రధాన మార్గంగా నిలిచింది. లీగల్‌నోటీసులు,అపాయింట్‌మెంట్ లెటర్లు, బ్యాంకింగ్ సంబంధిత పత్రాలు వంటి వాటిని పంపడానికి ఎంతగానో ఉపయోగపడింది. పంపిన వస్తువు అవతలివారికి చేరినట్లు రసీదు(డెలవరీ ప్రూఫ్) పొందడం ఒక ప్రత్యేకత, చట్టపరంగాను ఎంతో విలువైంది. ఇది కాస్తా మరో రెండు వారాల్లో కనుమరుగు కానున్నది.

స్పీడ్‌పోస్ట్‌లో విలీనం

రిజిస్టర్డ్ పోస్టు సేవను పూర్తిగా స్పీడ్‌పోస్ట్ సేవలో విలీనం చేస్తున్నట్లు తపాలాశాఖ ప్రకటించింది.తపాలాశాఖ తమ సేవలను ఆధునీకరించే ప్రయత్నంలో భాగంగా దేశీయ పోస్టల్ సేవలు క్రమబద్దీకరణ, పనితీరు మెరుగుపరచడం, ట్రాకింగ్ వ్యవస్థను బలోపేతం తదితర ప్రక్రియలో భాగంగానే స్పీడ్‌పోస్ట్‌లో రిజిస్టర్డ్ పోస్ట్‌ను విలీనం చేస్తున్నట్లు వెల్లడించింది. స్పీడ్‌పోస్టు అంటే వేగవంతమైన డెలవరీ, ఇప్పుడు రిజిస్టర్డ్ పోస్టు సేవలు స్పీడ్‌పోస్ట్‌లో కలపడంతోడెలవరీలుమరింత వేగవంతం కానుంది. స్పీడ్ పోస్టు ద్వారా పార్శిల్ ఎక్కడి వరకు చేరిందో ఆన్‌లైన్‌లో చెక్ చేసుకునే వెసులుబాటు ఉంది. ఇది రిజిస్టర్డ్ పోస్ట్ లేదు. ఒక సేవ ఉండటం వల్ల పోస్టల్ శాఖ పని మరింత సులభమవతుందని అధికారులు పేర్గొంటున్నారు.

తగ్గిన ఆదరణ.. పెరిగిన సాంకేతికత

వాస్తవంగా రిజిస్టర్డ్ పోస్ట్ వాడకం గణనీయంగా తగ్గింది. వాట్సాప్, జీమెయిల్ వంటి డిజిటల్ మాధ్యమాల రాకతో సమాచార మార్పిడి వేగవంతమైంది. ప్రభుత్వ కార్యాలయాలు సైతం ఇప్పుడు డిజిటల్ మార్గంలోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతోంది. ఐదేళ్ల జరిగిన రిజిస్టర్డ్ పోస్ట్ బుకింగ్ పరిశీలిస్తే 25శాతం పడిపోయింది. స్పీడ్‌పోస్టు, ఇతర కొరియర్‌సేవలు అందుబాటులోకి రావడంతో రిజిస్టర్డ్ పోస్టుకు డిమాండ్ తగ్గింది. అయితే తాజాగా స్పీడ్‌పోస్టుతో చార్జీల మోత తప్పని పరిస్థితి కనిపిస్తోంది.రిజిస్టర్డ్ పోస్ట్ కనీసం చార్జి రూ.26 నుంచి రూ.30 వరకు ఉంటుంది. స్పీడ్‌పోస్ట్ కనీస చార్జి రూ.41 ఇది రిజిస్టర్డ్ పోస్ట్‌తో పోలిస్తే 20 నుంచి 25 శాతం ఎక్కువ. ఇక చార్జీల భారం భరించకతప్పదు.

రెడ్‌పోస్టు బాక్స్‌పై ఊహాగానమే..

రిజిస్టర్డ్ పోస్ట్ సేవల రద్దు నేపథ్యంలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన రెడ్‌పోస్టుబాక్స్‌లు ఎత్తివేత ప్రచారం జోరుగా సాగుతోంది. సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారింది. దీంతో పోస్టల్ అభిమానులు కలత చెందుతున్నారు. దశాబ్దాలుగా నిస్వార్థంగా నిశ్శబ్దంగా నిశ్చలంగా విశ్వసనీయంగా సేవలు అందించిన భావోద్వేగాల నేస్తం ఇక కనిపించిందన్న బాధ వ్యక్తమావుతోంది. అయితే ఇందులో ఎలాంటి వాస్తవంలేదని , అది ఒక ఊహాగానమేనని మాత్రమే అని పోస్టల్ వర్గాలు అంటున్నాయి. పోస్టల్‌శాఖ ద్వారా ఎరుపు పోస్ట్‌బాక్స్‌లను ఎత్తివేస్తున్నట్లు అధికారిక ప్రకటన ఏదీ లేదని స్పష్టం చేస్తున్నారు.

కడప పోస్టల్ సూపరింటెండెంట్ ఏమంటున్నారంటే..

పోస్టుబాక్స్‌లు ఉండవనే సామాజిక మాధ్యమాలలో జరుగుతున్న ప్రచారంపై కడప పోస్టల్ ఎస్పీ రాజేష్‌ని 'సాక్షి' వివరణ కోరింది. ఇప్పటి వరకు పోస్టుబాక్స్‌లు తొలిగింపునకు సంబంధించి ఎలాంటి ఆదేశాలు రాలేదని ఎస్పీ స్పష్టం చేశారు.

ఆరోగ్యం కోసమే క్రీడా పోటీలు
– సమగ్రశిక్ష రాష్ట్ర పథక సంచాలకులు శ్రీనివాస్


ఎస్‌పీడీ శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల విద్యలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది శారీరక, మానసిక, ఆరోగ్యం కోసమే క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు సమగ్రశిక్ష రాష్ట్ర పథక సంచాలకులు(ఎస్‌పిడి) శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు రాష్ట్రస్థాయి లీప్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా కడప మున్సిపల్ హైస్కూల్లో నిర్మిస్తున్న సెంట్రల్ కిచెన్ షెడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో పనిచేసే బోధనేతర సిబ్బందికి ఈ నెల 20, 21 తేదీలలో ఏపీ పాఠశాల విద్యశాఖ రాష్ట్రస్థాయి లీప్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కడప జిల్లా విద్యాశాఖ బోధనేతర సిబ్బంది మర్యాద పూర్వకంగా ఆయను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కడప సూపర్ కింగ్స్ కెప్టెన్ మున్నా, వైఎస్ కెప్టెన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌తో గృహాలకు ఉచిత విద్యుత్
– ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ రమణ


సోలార్ రూఫ్ టాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఈ రమణ

ప్రొద్దుటూరు : జిల్లాలో సోలార్ రూఫ్‌టాప్ వలన గృహ వినియోగదారులు ఉచిత విద్యుత్‌ను పొందవచ్చని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ ఎస్.రమణ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని లక్ష్మీనగర్‌లోని వినియోగదారుల వద్దకు ఎస్ఈ రమణ వెళ్లి సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీరో పెట్టుబడి వ్యయంతో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. సోలార్ ద్వారా ఉత్పత్తి అయిన యూనిట్ల వలన కరెంట్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు తర్వాత సబ్సిడీ ప్రయోజనం మొత్తం మీ బ్యాంక్ ఖాతాకు 30 రోజుల్లోపు జమ అవుతుందన్నారు. ఈ సబ్సిడీ మొత్తం సుమారు రూ.98వేలు ఉంటుందన్నారు. దీని ద్వారా కొంత ఆర్థిక స్థిరత్వం కలుగుతుందని తెలిపారు. రానున్న కాలంలో విద్యుత్ వాహనాల ప్రాధాన్యత అధికంగా ఉంటుందని, వాటికి అవసరమైన విద్యుత్ శక్తి సోలార్ రూఫ్ టాప్ ద్వారా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్ ప్రొద్దుటూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ కృష్ణమోహన్, జూనియర్ ఇంజనీర్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రావణమాస ఉత్సవాలకు రూ.1.96 కోట్ల ఆదాయం


గండి క్షేత్రంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

వేంపల్లె : ఈ ఏడాది గండి దేవస్థానం సంబంధించి శ్రావణమాస ఉత్సవాలకు అన్ని విభాగాల నుంచి రూ.1,96,07,865ల ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య తెలిపారు. చక్రాయపేట మండలంలోని గండి వీరాంజనేయ స్వామి శ్రావణమాస మహోత్సవాలు ముగిసిన సందర్భంగా అధికారులు హుండీ, టికెట్ల, ఆదాయ, తదితర అన్ని విభాగాల లెక్కింపులు నిర్వహించారు. శుక్రవారం కడప దేవాదాయ శాఖ సి.శివయ్య పర్యవేక్షణలో పోలీసు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ సిబ్బంది సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించగా నగదు రూపంలో రూ.40,71,120, బంగారు వస్తువులు 11గ్రాములు, వెండి వస్తువులు తొమ్మిది గ్రాములు, యూఏఈ అరబ్ 10 దిర్హమ్స్ ఆదాయం వచ్చింది. గత ఏడాది శ్రావణమాస మహోత్సవాలకు రూ.1.60,35,630 రాగా, ప్రస్తుతం ఈ ఏడాది రూ.1,96,07,865ల ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణ తేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, ప్రధాన ఉప ప్రధాన అర్చకులు కేసరి, రాజా రమేష్, ఆర్కే వ్యాలీ పోలీసులు, నారాయణ స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది, ట్రిపుల్ ఐటీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిరోధానికి పటిష్ట చర్యలు

జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : మత్తుపదార్థాల వినియోగం, విక్రయాలు, రవాణాను అరికట్టడానికి జిల్లాలో పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో జిల్లాలో మత్తు పదార్థాల నివారణ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నిరోధంపై జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి యాక్షన్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల మూల సరఫరా రవాణాను అరికట్టేందుకు జిల్లాలో పటిష్టమైన నిఘా చర్యలు అవలంబించాలని తెలిపారు. విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, వర్కర్లను లక్ష్యంగా చేసుకుని సరఫరా జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని.. మాదకద్రవ్యాలు విక్రయాలు జరిగే చోట గట్టి నిఘా ఉంచాలన్నారు. మాదకద్రవ్యాల బారిన పడిన బాధితుల పట్ల సున్నితంగా వ్యవహరించాలని పోలీస్ శాఖకు సూచించారు. బాధితులకు కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు పునరావాసం కల్పించాలని అన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఈగల్స్ టీమ్స్ ద్వారా మాదకద్రవ్యాల నిరోధకం, వాడకం పై ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. అక్రమ డ్రగ్స్ వాడకం, రవాణాపై సమాచారాన్ని తెలిపేందుకు.. పోలీసు శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ : 1972 లకు కాల్ చేయవచ్చన్నారు. రిమ్స్ ప్రాంగణంలోని డి.అడిక్షన్ సెంటర్ ను ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ మరియు ప్రైవేట్ హాస్టళ్లనందు డ్రగ్స్ వినియోగం జరగకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కడప.మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇరిన్, కష్టమ్స్ శాఖ, పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ, విద్య, వైద్య, వ్యవసాయ, రవాణా, సంక్షేమ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ – పాస్ యంత్రాలతోనే ఎరువుల విక్రయాలు

జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్

కడప ఎడ్యుకేషన్ : రైతు సేవా కేంద్రాలలో పనిచేసే వ్యవసాయ సిబ్బంది, ప్రైవేటు డీలర్లందరూ ఎరువులను తప్పకుండా ఈ–పాస్ యంత్రాలతోనే విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కడప కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ కార్యాలయ సమావేశ మందిరంలో రైతు సేంద్రాలలో పనిచేసే అగ్రికల్చర్ అసిస్టెంట్లకు ఈ పాస్ యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలలో పనిచేసే అగ్రికల్చర్ అసిస్టెంట్లు క్రమం తప్పకుండా ఈ పాస్ యంత్రాల ద్వారానే ఎరువులను విక్రయించాలన్నారు. కొత్తగా వచ్చిన ఈ పాస్ యంత్రాలు కొత్త వర్షన్‌తో వచ్చాయని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా 100 ఈ పాస్ యంత్రాలను పంపిణీ చేశామన్నారు. డీలర్లు కూడా ఈ పాస్ యంత్రాల ద్వారానే ఎరువులను అమ్మకాలు చేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. వీటితోపాటు రైతులకు సకాలంలో అన్ని సేవలను అందించి వ్యవసాయ అధికృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జేడీఏ కార్యాలయ ఏడి మాధవి, జేడీఏ కార్యాలయ టెక్నికల్ ఏవో గోవర్ధన్‌తోపాటు రైతు సేవా కేంద్రాల అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలతోనే ఉన్నత స్థాయి

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మారెడ్డి


మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : క్రమశిక్షణతో కూడిన జీవనశైలి, సమస్యకు పరిష్కారం చూపే వినూత్న ఆలోచనలు మిమ్మలను ఉన్నత స్థాయిలో నిలుపుతాయని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో 'మోటివేషనల్ టాక్ ఆన్ కెరీర్'పై అవగాహన సదస్సు విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని అన్నమాచార్య సేన హాల్లో శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ వి బ్రహ్మారెడ్డి కీలక ఉపన్యాసం చేశారు. నేటితరం యువత సరికొత్త నిర్ణయాలు తీసుకుంటున్నారని గుర్తుచేస్తూ కెరీర్‌లో సక్సెస్ కావాలంటే మాట్లాడడం నేర్చుకోవాలన్నారు ముఖ్యంగా పుస్తకాలు చదవడం అలవాటుగా మారితే ఒక కొత్త లోకం చూసినట్లు ఉంటుందన్నారు. మంచి సినిమాలు చూడాలని, అందులోని విలువైన విషయాన్ని జీవితానికి ఉపయోగపడే వాటిని తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని, ఉద్వేగాలు, ఉద్రేకాలకు దూరంగా ఉండాలన్నారు. అతిగా ఆలోచించడం మానివేయాలని సూచించారు. ఇతరులకు ఇబ్బంది లేకుండా స్వతంత్రంగా జీవించడం అలవర్చుకోవాలని తెలిపారు. వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి పద్మ మాట్లాడుతూ నైపుణ్యాలు పొందడంలో గత కాలానికి నేటికీ అనూహ్య మార్పులు వచ్చాయన్నారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని సమయపాలన పాటిస్తూ వాటిని సాకారం చేసుకోవాలన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. విశ్వనాథ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని తీసుకువచ్చేందుకు జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విశ్వవిద్యాలయ సమన్వయకర్త ఎన్ వెంకట్రామిరెడ్డి , పీఓలు డాక్టర్ లలిత, ఎం. అనిత, డాక్టర్ శ్రీ నివాసరావు, అధ్యాపకులు డాక్టర్ ఎస్. రాజగోపాల్ రెడ్డి, డాక్టర్ టి. సురేష్ బాబు, సుధీర్, డాక్టర్ మరియదాస్, మనస్విత, వెంకటరమణ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై లారీ ఢీకొని వ్యక్తి మృతి

చింతకొమ్మదిన్నె: కడప – చిత్తూరు జాతీయ రహదారిపై మండల పరిధిలోని మద్దిమడుగు సుగాలి బిడికి వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బుక్కే నాగే నాయక్(55) మృతి చెందగా అతని భార్య బుక్కే గోమిలమ్మ(50) తీవ్రంగా గాయపడ్డారు. గేదెలు, మేకలు మేపుకొని సాయంత్రం సమీప గువ్వలచెరువు కొండ నుంచి ఇంటికి వస్తుండగా కడప నుంచి గువ్వల చెరువు వైపు వెళ్తున్న ట్రాన్స్‌పోర్ట్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసుకుంటూ వచ్చి ఢీకొని పారిపోయాడు. బుక్కే నాగేనాయక్ చెవిటి, మూగ కావడంతో మాట్లాడలేక రోడ్డు పక్కగా పడిపోయాడు. గోమీలమ్మ కూడా తీవ్రంగా గాయపడింది.వెనుకగా వస్తున్న ప్రయాణికులు చూసి స్థానికులకు సమాచారం ఇచ్చారు. లారీని వెంబడించి గువ్వల చెరువు సమీపంలో పట్టుకొన్నారు.రోడ్డు ప్రమాదానికి గురైన దంపతులను చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. బుక్కే నాగేనాయక్ మృతి చెందాడు. గోమీలమ్మ రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాందేడ్–ధర్మవరం రైలు రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తెలంగాణాలోని కామారెడ్డిలో భారీ వర్షాల కారణంగా పలు రైళ్లను రద్దు చేశారు. అందులో 07189, 07190 నాందేడ్–ధర్మవరం , ధర్మవరం–నాందేడ్ మీదుగా నడుస్తున్న రైలును ఈనెల 29, 30 తేదీల్లో రద్దుచేసినట్లు కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు.

కాచిగూడ–తిరుపతి మధ్య ప్రత్యేక రైలు :

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కాచిగూడ–తిరుపతి–కాచిగూడ మధ్య ప్రత్యేక రైలును నడుపుతున్నారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. 02793 నెంబరుగల తిరుపతి–కాచిగూడ మధ్య నడుపుతున్నారు. ఈ రైలు శనివారం రాత్రి 9.10 గంటలకు తిరుపతిలో బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, తాడిపత్రి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, యాదిగిరి, సేలం, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాదు జంక్షన్ మీదుగా కాచిగూడకు ఉదయం 11 గంటలకు చేరుతుందన్నారు.

ఆటో చోరీకి పాల్పడిన 24 గంటల్లోనే దొంగ అరెస్ట్

కడప అర్బన్ : ఆటో చోరీకి పాల్పడిన కడప నగరం ఎన్జీవో కాలనీ చెందిన తుమ్మలూరు అనిల్ కుమార్‌ను 24 గంటల్లోపే అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి లక్ష రూపాయల విలువైన ఆటో స్వాధీనం చేసుకున్నట్లు కడప చిన్న చౌక్ సీఐ జి. ఓబులేసు తెలిపారు. నిందితుడిపై గతంలో 7 క్రిమినల్ కేసులు వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదయినట్లు తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో సీఐ వివరాలను తెలియజేశారు. చిన్నచౌక్ , రైల్వేకోడూరు, తిరుపతి వెస్ట్ ,తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్లలో ఆటో దొంగతనాలుకు పాల్పడగా కేసులు నమోదు చేశారన్నారు. చెన్నూరు కడప వన్ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కూడా అతడు పలు కేసులలో నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో చిన్నచౌక్ ఇన్‌స్పెక్టర్ ఓబులేసు, ఎస్ఐలు రాజరాజేశ్వరరెడ్డి రవికుమార్ సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించిన తర్వాత నిందితుడిని గుర్తించామన్నారు. శుక్రవారం తాడిపత్రి–తిరుపతి బైపాస్ రోడ్డులోని చలమారెడ్డిపల్లి క్రాస్ రోడ్ వద్ద నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కేసును విజయవంతంగా 24 గంటల్లోపే ఛేదించిన సీఐ, ఎస్ఐలతో పాటు హెడ్ కానిస్టేబుల్స్ వేణుగోపాల్, శివకుమార్, కానిస్టేబుళ్లు ఖాదర్ హుస్సేన్, ప్రదీప్ కుమార్, సుధాకర్ యాదవ్, మాధవరెడ్డిలను కడప డీఎస్పీ అభినందించారన్నారు. రివార్డుల కోసం సిఫార్సు చేస్తున్నట్లు తెలిపారు.


నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

ఘనంగా తెలుగు భాషాదినోత్సవం


గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఆచార్య మేడిపల్లి రవికుమార్ తదితరులు

కడప ఎడ్యుకేషన్ : తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు వెంకట రామమూర్తి తెలుగు వ్యావహారిక భాషకు చేసిన సేవలోని సంస్కారాన్ని అందిపుచ్చుకోవడమే అసలైన తెలుగు భాషా దినోత్సవమని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు ఆచార్య మేడిపల్లి రవికుమార్ పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం శుక్రవారం బ్రౌన్ శాస్త్రి సమావేశ మందిరంలో గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, వక్త ఆచార్య మేడిపల్లి రవికుమార్, పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ప్రధానవక్తగా విచ్చేసిన ఆచార్య మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ గిడుగు రామమూర్తి పట్టుదల గల మనిషని, సాధారణ ఉపాధ్యాయుడుగా జీవితం ప్రారంభించినప్పటికీ తనకు పరిచయం లేని సవర భాషను నేర్చుకున్నారన్నారు. అంతేగాక ఆ భాషకు వ్యాకరణాన్ని, నిఘంటువును రూపొందించారన్నారు. ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ నాగబు అనేది తొలి తెలుగు పదమని, అది అమరావతి శాసనం ఆధారంగా తెలిసిందన్నారు. . ఆచార్య మేడిపల్లి రవికుమార్‌ను ఆచార్య జి.పార్వతి, జానమద్ది విజయ భాస్కర్, డా. భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డా. చింతకుంట శివారెడ్డి, ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, ఎం.మౌనిక, సిబ్బంది కలసి ఘనంగా సత్కరించారు.

అన్నమయ్య జిల్లా వద్దు.. బ్రహ్మంగారి జిల్లా ముద్దు

- బ్రహ్మంగారి జిల్లా కావాలంటూ ప్రజాసంఘాల నిరసన
- బద్వేలు నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం
- జిల్లా సాధన సమితికి సంఘీభావం తెలిపిన విశ్వనాథరెడ్డి



బద్వేలులో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు, మాట్లాడుతున్న ఎస్.విశ్వనాథరెడ్డి

బద్వేలు : రాజంపేటను జిల్లాగా చేసి అందులో బద్వేలు నియోజకవర్గాన్ని కలుపుతామని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో అదే రోజు నుంచి బద్వేలు నియోజకవర్గంలో నిరసన జ్వాలలు రగులుకున్నాయి. ప్రతి రోజూ ఏదో ఒక సంఘం బద్వేలును కడప జిల్లాలోనే ఉంచాలని రాజంపేట వద్దని నిరసన రాగాలు వినిపిస్తూనే ఉన్నాయి. తాజాగా శుక్రవారం వీరబ్రహ్మేంద్రస్వామి జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో బద్వేలును జిల్లా చేయాలని అన్ని వర్గాల ప్రజలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా జరిగిన నిరసన కార్యక్రమానికి బద్వేలు పట్టణ ప్రజలే కాకుండా గ్రామాలని నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.

ఉంటే వైఎస్ఆర్ కడప జిల్లా.. లేకుంటే బ్రహ్మంగారి పేరున జిల్లా

నాలుగు రోడ్ల కూడలిలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి వైఎస్ఆర్ సీపీ బద్వేలు నియోజకవర్గ అదనపు కార్యదర్శి నల్లేరు విశ్వనాథరెడ్డి తన సంఘీభావాన్ని తెలియజేశారు.ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కడప జిల్లాతో దశాబ్దాల కాలం నుంచి బద్వేలు నియోజక వర్గానికి విడదీయరాని బంధం ఉందని, దానిని కాదని నూతనంగా ఏర్పాటు చేస్తున్న రాజంపేట జిల్లాలో బద్వేలు నియోజక వర్గాన్ని కలుపుతామనడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి తప్పుడు ఆలోచనలు కూటమి ప్రభుత్వం మాను కోవాలని హితవు పలికారు. ఒకవేళ తప్పదని బద్వేలును వైఎస్ఆర్ కడప జిల్లా నుంచి విడదీయాలని అనుకుంటే బ్రహ్మంగారి మఠం లో కొలువైన వీరబ్రంహ్మేస్వామి పేరుతో బద్వేలు నియోజక వర్గాన్ని జిల్లా కేంద్రం చేయాలన్నారు. అందుకు బద్వేలు పట్టణానికి అన్ని రకాల బౌగోళిక పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయులు, పెన్షనర్ల విభాగం మేధావులు, బీసీ సాధన సమితి, దళిత సాధన సమితి, విద్యార్థి విభాగం నాయకులు వివిధ పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.